

# హితబోధ

అనగా అనగా ఒక రాజుగారు. ఆ రాజుగారి పేరు విజయుడు. ఆయన భార్య పేరు ఇందుమతి. రాణీగారంటే రాజుగారికి చాలా ఇష్టం. ఆమె మాటను రాజుగారు ఎప్పుడూ కాదనలేదు, ఇందుమతి ఏం చెబితే అది ఆ క్షణాన జరగవలసిందే.

ఒకసారి రాజుగారూ, రాణీగారూ కలసి అడవిలో వేటాడడంకోసం వెళ్ళారు. వేట మీది దృష్టితో అడవి నడిమధ్యకు వచ్చిన సంగతి వారికి తెలియలేదు. ఇహ తిరిగి పోదామని అనుకొంటూ ఉండగా ఓ బంగారు లేడిని రాజుగారు చూశారు. రాజుగారు బంగారు లేడి కోసం తరుముకొంటూ వెళ్ళారు. కానీ అది చిక్కలేదు. రాజుగారు తమ గుడారానికి తిరిగి వచ్చారు. లేడిని పట్టుకు రమ్మని సైనికులతో చెప్పారు. సైనికులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అయినా లేడి వారికి చిక్కలేదు.

రాణీగారికి కోపం వచ్చింది. వచ్చిందని రాజుగారు కూడా గ్రహించారు. రాణీగారికి కోపం తగ్గాలంటే బంగారు లేడి దొరక వలసిందే తప్ప వేరో మార్గంలేదని రాజుగారికి తెలుసు. అందుకని రాజుగారు దేశమంతటా చాటింపు వేయించారు. ఫలానా అరణ్యంలో ఉన్న బంగారు లేడిని ప్రాణంతోగానీ ప్రాణంలేకుండాగానీ పట్టి తెచ్చిన వారికి తన రాజ్యంలో సగం ఇస్తానని వారు ప్రకటించారు.

రాజ్యం మీద ఆపేక్ష కొద్దీ అనేక వందలమంది విల్లు అంబుల్నీ, వలల్నీ పట్టుకొని అడవికెళ్ళారు. ఆ బంగారు లేడికోసం నిద్రాహారాలు మాని ప్రయత్నింపసాగారు.

ఇలా వారాలు, మాసాలు గడిచిపోయాయి. ఒక రోజున ఆ బంగారు లేడి తనంతట తానే రాజసభకు వచ్చింది. రాజుగారికి, సభకూ నమస్కారం చేసి ఇలా అన్నది. ఏమని అంటే—

"రాజా! నీవు చాలా పొరపాటు చేశావు. భార్య మీది మమకారంతో నన్ను పట్టి తెచ్చిన వారికి అర్ధరాజ్యమిస్తానని చాటింపు వేయించావు రాజ్యం మీది మమకారంతో సాత్వికులైన ప్రజలందరూ వేటగాళ్ళుగా మారిపోయారు. వారలా మారిపోవడానికి నీవే కారణం. మానవులను మానవోత్తములుగా తీర్చిదిద్దాలి గాని, వేటగాళ్ళస్థాయికి దిగజార్చడం రాజధర్మంకాదు" అని హితవు చెప్పింది ఆ బంగారులేడి.

రాజుగారు సిగ్గుతో తలవొంచుకున్నారు.